

## డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే ఇక జైలుకే

### టీటీఐ ఏసీపీ శంకర్ రాజు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 5: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని బేగంపేట్ ట్రాఫిక్ శిక్షణ కేంద్రం ఏసీపీ జి. శంకర్‌రాజు సూచించారు. బేగంపేట్ ట్రాఫిక్ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నాంపల్లిలోని ఐసీఐసీఐ అకాడమీలో ఫర్ స్కిల్ సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు, నివారణ అనే అంశంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో శంకర్‌రాజు మోటారు వాహనాల చట్టం గురించి వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా రోడ్డుపైకి వాహనాలతో రావొద్దని అన్నారు. చలాన్‌తో పాటు జైలు శిక్షకు గురికావాల్సి వస్తుందన్నారు. లైసెన్స్ లేకుండా రోడ్లపైకి వచ్చిన ఆరు వేల మందికి బేగంపేట్‌లోని టీటీఐలో కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో టీటీఐ శిక్షకులు రజనీకాంత్‌రెడ్డి, మురళీ మోహన్ పాల్గొన్నారు.



## యోగానంద జీవితం స్ఫూర్తిదాయకం

సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ): యోగానంద జీవితం స్ఫూర్తిదాయకమని పలువురు ఆధ్యాత్మిక గురువులు పేర్కొన్నారు. యోగానంద జయంతిని పురస్కరించుకొని బేగంపేటలోని వైఎస్ఎస్ ధ్యాన కేంద్రంలో ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి దేశ విదేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా పలువురు భక్తి గీతాలు ఆలపించారు.



## ప్రజలను జాగృతం చేసిన షోయబుల్లాఖాన్

### ఆర్టీఐ మాజీ ప్రధాన కమిషనర్ బుద్ధ మురళి

ముషీరాబాద్, జనవరి 5: పత్రికా రచయితగా షోయబుల్లాఖాన్ నిజాం నిరంకుశ పాలనను ప్రశ్నిస్తూ ప్రజలను జాగృతం చేయడంలో కీలక పాత్ర పోషించారని ఆర్టీఐ మాజీ ప్రధాన కమిషనర్ బుద్ధ మురళి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ధి పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ప్రముఖ పాత్రికేయుడు షోయబుల్లాఖాన్ సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో బుద్ధ మురళి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గతంలో పత్రికలకు రాజకీయాలకు మధ్య సంబంధాలు సామాజిక, దేశ ప్రయోజనాల కోసం మాత్రమే ఉండేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని, పత్రికలు ఆర్థిక అవసరాల కోసమే మార్పు చెందాయని చెప్పారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జయసూర్య, పబ్బా వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ సెక్యూరిటీలో ఇస్రోకు జేఎన్‌టీయూ సాయం

సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : ఇస్రోకు సైబర్ సెక్యూరిటీ టెక్నాలజీ అందించేందుకు జేఎన్‌టీయూ ముందుకొచ్చింది. ఈ మేరకు ఇస్రో, జేఎన్‌టీయూ మధ్య టెక్నాలజీ పంచుకోవడంలో పరస్పర అవగాహన కుదుర్చుకుంటున్నాయి.

# పారా అథ్లెట్లతో దేశానికి ఉజ్వల భవిష్యత్

### గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

కంటోన్మెంట్, జనవరి 5: ప్రపంచ ఎబిలిటీ క్రీడల్లో గెలుపొంది పారా ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం గొప్ప విషయమని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. శుక్రవారం రసూల్‌పురాలోని ఆదిత్య మెహతా ఫౌండేషన్(ఏఎంఎఫ్), జవహర్ నవోదయ విద్యాలయ సమితి ఆధ్వర్యంలో పారా ఒలింపిక్స్ 2024కు అర్హత సాధించిన క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి వర్చువల్‌గా హాజరైన గవర్నర్ తమిళిసై.. క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారా అథ్లెట్లతో దేశానికి ఉజ్వల భవిష్యత్ ఉన్నదని అన్నారు. డిస్కస్ త్రోలో షాట్‌పుట్‌లో జ్యోతి క్యాంసం సాధించడంతో పాటు హ్యాండ్ సైక్లింగ్‌లో ప్రశాంత్ క్యాంసం సాధించడం ఆనందంగా ఉన్నదని సినీ నటి, నిర్మాత మంచు లక్ష్మి అన్నారు. ఆయా విభాగాల్లో స్వర్ణం, రజత, కాంస్య పతకాలు సాధించి ఫౌండేషన్‌కు మంచి పేరు తేవడం గర్వకారణంగా ఉందన్నారు. ఆదిత్య మెహత ఫౌండేషన్ దశాబ్ద కాలంగా పారా అథ్లెట్లకు శిక్షణ అందించడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించి, వారి సామర్థ్యాలను వెలికితీయడం ఎందరికో స్ఫూర్తినిస్తుందని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ అన్నారు. అనంతరం క్రీడాకారులకు కృత్రిమ అవయవాలు, వీల్‌చైర్లు, క్రీడా పరికరాలతో సహా సుమారు రూ.1.5కోట్ల విలువైన శిక్షణ పరికరాలను ఆదిత్యా మెహతా ఫౌండేషన్ అందించింది.



కార్వాన్ జాఫర్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొక్క నాటి నీరు పోస్తున్న మంచు లక్ష్మి

అంతకు ముందు క్రీడాకారులకు పతకాలను అందించడంతో పాటు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంఎఫ్ ట్రస్టీ, ఫాస్ట్ మిసెస్ ఇండియా, ఎంటర్‌ప్రెన్యూర్ శిల్పారెడ్డి, ఎన్ఎండీసీ చైర్మన్ అమితవ్ ముఖర్జీ, జేఎన్‌వీ సౌత్ రీజియన్ హెడ్, డిప్యూటీ కమిషనర్ టీ.గోపాల కృష్ణ, ఏఎంఎఫ్ ఫౌండర్ ఆదిత్య మెహతా తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

కార్వాన్: కార్వాన్‌లోని జాఫర్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో టీచ్ ఫర్ చేంజ్ , పెగా సిస్టం ఇండియా సంస్థల అధ్వర్యంలో పలు వసతులు కల్పించారు. వీటి ప్రారంభోత్సవానికి టీచ్ ఫర్ చేంజ్ వ్యవస్థాపకురాలు, నటి మంచులక్ష్మి హాజరయ్యారు. పాఠశాల ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంచులక్ష్మి మాట్లాడుతూ తెలంగాణలో విద్యతో విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పెగా సిస్టమ్స్ ఇండియాతో కలిసి విద్యార్థులకు అనుకూలమైన వాతావరణంలో తరగతులు బోధించేలా తమ సంస్థ కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధరణికోట సుయోధన్, విద్యాశాఖ అధికారిణి రోహిని దేవి లతో స్థానిక బీఆర్ఎస్ నాయకుడు జీవన్ సింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ యువజనోత్సవాలు

సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ): సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడానికి విద్యార్థులు, యువత సిద్ధం కావాలని పలువురు విద్యావేత్తలు పిలుపునిస్తున్నారు. 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవాన్ని నగర వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వివేకానంద జీవితంపై పలు విద్యా సంస్థలు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నాయి. విద్యార్థులు, యువజనుల కోసం ప్రత్యేకంగా క్రీడలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. నేటి నుంచే పలు సంస్థలు సంస్కృతి, సంప్రదాయబద్ధంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నేషనల్ యూత్



ఫెస్ట్‌లో భాగంగా శ్రోతలకు కవిత్వ శ్రవణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

### భారతీయతను ఇనుమడింపజేసిన వివేకానంద

**- వాణి, కేశవ్ మెమోరియల్ కళాశాల ప్రిన్సిపాల్**

స్వామి వివేకానంద జీవితం విద్యార్థులకు స్ఫూర్తిగా ఉండాలి. దేశ విదేశాల్లో భారతీయ సంస్కృతిని, సోదరభావాన్ని ఇనుమడింపజేసిన వివేకానంద ఎందరికో స్ఫూర్తిదాయకం. ఆయన జయంతి సందర్భంగా కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు పలు రకాల క్రీడలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నాం. 8 నుంచి 11వ తేదీ వరకు పలు అంశాల్లో పోటీలు జరుగనున్నాయి. 12న జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

## దివ్యాంగుల కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలు

### ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్



సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ): అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాలకు దివ్యాంగులకు ఉపయోపడేలా ఆవిష్కరణలు చేయాలని, అందుకోసం నిపుణులు పనిచేయాల్సిన అవసరమున్నదని రాష్ట్ర ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్ అన్నారు. తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ (టీఎస్ఐసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన సహాయ సాంకేతిక సమ్మిట్-2024 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీఎస్ఐసీ సీఐఓ శాంతా తౌటం, భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ క్రికెట్ మహేందర్ వైష్ణమ్, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ ఎం.బాలలత తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నిబంధనలపై కంపెనీలు దృష్టి పెట్టాలి

### ట్రాఫిక్ ఏసీపీ రణ్‌వీర్‌రెడ్డి

సిటీబ్యూరో, జనవరి 5 (నమస్తే తెలంగాణ): ఐటీ కంపెనీలు, హాస్పిటళ్లు, హోటళ్లు, ఇతర వ్యాపార, వాణిజ్య సంస్థలు ట్రాఫిక్ నిబంధనలపై దృష్టిపెట్టి, వాటి అమలుకు చర్యలు తీసుకోవాలని మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ రణ్‌వీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ), వివిధ కంపెనీలు, వ్యాపార సంస్థలతో నిర్వహించిన ఇంటరాక్టివ్ సమావేశంలో పాల్గొన్న ఏసీపీ, ఎస్‌సీఎస్‌సీ ఏడీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయా కంపెనీలు, వ్యాపార సంస్థలకు పలు సూచనలు జారీ చేశారు.

## అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కొండాపూర్, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలు- 2024 మాదాపూర్‌లోని శిల్పారామంలో శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువజన సర్వీసుల శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు హాజరై నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇందులో భాగంగా రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలు, జానపద సాంస్కృతిక అంశాలు ప్రతిబింబించే విధంగా రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన యువతీ యువకులు దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన వేషధారణ, వేష భాష, సాంస్కృతిక వైవిధ్యాలను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జానపద గాయని అరుణ, గాయకుడు సుబ్బారావు, లింగా శ్రీనివాస్, డి. ప్రశాంత్‌కుమార్, టీఎస్ స్టెప్ జనరల్ మేనేజర్ కె. వేణుగోపాలరావు, డిప్యూటీ డైరెక్టర్ అనంత్‌రెడ్డి, మేనేజర్ జగన్నాథం, అకౌంట్స్ ఆఫీసర్ ఓం ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న యువజన సర్వీసుల శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు